E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు..
ఒక్కరోజే రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి » 4లో

హైదరాబాద్ (తేదీ) 21-01-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక: 21|| పేజీలు–6 www.ekaburu.com

# కాలుష్య రహితం.. పర్యావరణ హితం

- » దేశంలోనే తొలి నెట్ జీరో గ్రీన్ ఫీల్డ్ నగరంగా ఫ్యూచర్ సిటీ
- » దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- » ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు
- » ఇప్పటికే మరుబెని, సెమ్ కార్ప్‌ల భాగస్వామ్యం
- » యూఏఈ మంత్రికి వివరించిన సీఎం.. కలిసి పనిచేస్తామన్న అల్‌మార్రీ
- » పలు సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి భేటీ
- » యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీపై సౌదీ సంస్థ 'ఎక్స్‌పర్టైజ్' ఆసక్తి
- » ఏఐ రంగంలో తెలంగాణతో రాయల్ ఫిలిప్స్ భాగస్వామ్యం
- » వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు గూగుల్ సంసిద్ధత



ఈకబురు, హైదరాబాద్: దేశంలోనే తొలి కాలుష్య రహిత, పర్యావరణ హిత (నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్) స్మార్ట్ సిటీగా తెలంగాణలో రూపుదిద్దుకోనున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి ప్రాజెక్టు ప్రత్యేకతలను దావోస్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. 30 వేల ఎకరాల్లో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మరుబెని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వామ్యం కావడం గురించి తెలియజేయడంతో పాటు, రిలయన్స్ గ్రూప్ (వంతారా) ఏర్పాటు చేస్తున్న జంతు ప్రదర్శనశాల ప్రత్యేకతలను వివరించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం తొలిరోజు వరుస భేటీలు నిర్వహించింది. అంతర్జాతీయంగా పేరొందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులతో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మరోవైపు యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్‌మార్రీతో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఫ్యూచర్ సిటీ గురించి చెప్పారు. ఈ భేటీల్లో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను సీఎం ఈ సందర్భంగా వివరించారు.

**ఫ్యూచర్ సిటీపై యూఏఈ ఆసక్తి**

భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో తెలంగాణతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తెలిపారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తితో ఉందన్నారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

తరువాయి 2లో

## వామపక్షాలు బలపడితేనే ప్రజాస్వామ్యం పదిలం

- » సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- » వామపక్ష భావజాలం అవసరం: ఉప ముఖ్యమంత్రి భట్టి



ఈ-కబురు,ఖమ్మం; ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే కమ్యూనిస్టులు బలోపేతం కావాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలన్నీ ఏకతాటిపై నిలిచి ఉద్యమాలు చేపట్టాలని నొక్కిచెప్పారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఓటుహక్కు సహా ప్రజల హక్కులన్నింటినీ హరించి వేస్తోందని, మోదీ సర్కారును గద్దె దించాలని పిలుపునిచ్చారు.

తరువాయి 2లో

## డీయెగో గార్సియాపై ట్రంప్ కన్ను

» కీలక దీవిని మారిషస్‌కు తిరిగిచ్చే యూకే నిర్ణయం మూర్ఖత్వమంటూ పోస్టు



న్యూఢిల్లీ, జనవరి 20: అమెరికా జాతీయ భద్రత పేరుతో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌కు అత్యంత సమీపంలో ఉన్న డీయెగో గార్సియాపైనా కన్నేశారు. హిందూ మహా సముద్రంలో కీలక ప్రాం తంలో ఉన్న ఈ చిన్న దీవిని తమ నియంత్రణలో ఉంచుకోవడం మేలన్న తరహాలో వ్యాఖ్యలు చేశారు. మారిష్‌సకు చెందిన ఈ దీవి ప్రస్తుతం యూకే ఆధీనంలో ఉంది. ఇక్కడ యూకే, అమెరికాల ఉమ్మడి సైనిక, నౌకా స్థావరం ఉంది. అయితే ఈ దీవిని మారిష్‌సకు తిరిగి ఇచ్చేందుకు గత ఏడాదే బ్రిటన్, మారిషస్ మధ్య ఒప్పందం కుదిరింది. దానిని తప్పుపడుతూ, తాను గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి లింకు పెడుతూ ట్రంప్ తాజాగా పోస్టు పెట్టారు. "మా తెలివైన నాటో మిత్రదేశం యూకే కీలక అమెరికా సైనిక స్థావరం ఉన్న డీయెగో గార్సియాను మారిష్‌సకు తిరిగి ఇచ్చేస్తోంది. ఎలాంటి కారణం లేకుండా ఇలా చేయడం ఆశ్చర్యకరం.

తరువాయి 3లో

## సినిమా టికెట్ ధరల పెంపును 90 రోజుల ముందే వెల్లడించాలి

» 2లో

- » పెంచవద్దన్నా పట్టించుకోరా?
- » ఉత్తర్వులుండగా ఎలా అనుమతించారు?
- » హోంశాఖ ముఖ్యకార్యదర్శి తీరుపై హైకోర్టు ఆగ్రహం
- » సుమోటో కోర్టు ధిక్కరణగా నోటీసులు జారీ





వీధి కుక్కల సామూహిక హత్య.. జంతు సంక్షేమ సంస్థల ఆందోళన

» 3లో

## పార్టీ వ్యవహారాల్లో... నబీన్ నా బాస్

- » నా పనితీరుపై నిర్ణేత: మోదీ
- » బీజేపీ పగ్గాలు చేపట్టిన నబీన్
- » వేడుకగా జరిగిన కార్యక్రమం
- » హాజరైన బీజేపీ ముఖ్య నేతలు

**ఈ-కబురు, న్యూఢిల్లీ: బీజేపీ ప్రస్థానంలో నూతన శకానికి తెర లేచింది. బిహార్‌కు చెందిన యువ నాయకుడు నితిన్ నబీన్ సిన్హా పార్టీ జాతీయ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ఇందుకు వేదికైంది. బీజేపీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో 45 ఏళ్ల నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రకటించారు.**



ఈ మేరకు సర్టిఫికెట్‌ను ఆయనకు అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఐదో అంతస్తులోని చాంబర్‌లో ప్రస్తుత అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా నుంచి నబీన్ లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ అతిరథ మహారథులంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి, నయాబ్ సింగ్ సైనీ, ప్రమోద్ సావంత్, ముఖ్యమంత్రి పేమా ఖండు తదితరులు వీరిలో ఉన్నారు. మోదీతో పాటు వారంతా నబీన్‌ను స్వయంగా అధ్యక్ష చాంబర్లోకి తోడ్కొని వెళ్లారు. బీజేపీ చరిత్రలో అతి పిన్న వయస్కుడైన అధ్యక్షునిగా, బిహార్ నుంచి వచ్చిన తొలి సారథిగా నబీన్ నిలిచారు. బీజేపీకి ఆయన 12వ అధ్యక్షుడు. నబీన్ ఎన్నికను చరిత్రాత్మక ఘట్టంగా నడ్డా అభివర్ణించారు. ఇంతకాలం తనకు అన్నివిధాలా సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

నితిన్ వెన్నంటి సాగుతాం: మోదీ

బీజేపీ నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నబీన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను నవతరానికి ప్రతినిధి (మిలీనియల్)గా అభివర్ణించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. "ప్రభుత్వ నేతగా, ప్రధానిగా ఎంత అనుభవమున్నా అన్నింటికంటే ముందు నేను బీజేపీ కార్యకర్తను. ఇకపై పార్టీపరమైన వ్యవహారాల్లో నితిన్ నాకు బాస్'' అని చెప్పారు. ఆయన్ను పదేపదే 'గౌరవనీయులైన'

తరువాయి 2లో



## మీపైనా నిఘా ఉంచారు తెలుసా?

- రఘునందన్‌రావు కదలికలను ఎలా కట్టడి చేశారు?
- ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును ప్రశ్నించిన సిట్ అధికారులు
- పలు ప్రశ్నలకు తెలియదని, నమ్మనని సమాధానాలిచ్చిన మాజీ మంత్రి
- దాదాపు ఏడున్నర గంటలపాటు కొనసాగిన విచారణ
- ఆయనను మరోసారి విచారణకు పిలవాలని సిట్ నిర్ణయం

ఈకబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏడున్నర గంటలపాటు సుదీర్ఘంగా విచారించింది. పలు ప్రశ్నలకు ఆయన 'గుర్తులేదు... తెలియదు... నేను నమ్మను' లాంటి సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసులో విచారణకు రావాలంటూ సిట్ నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో హరీశ్‌రావు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత తనను కేసులో ఇరికించే ప్రయత్నం చేయొద్దని... అవసరమైతే కోర్టుకు వెళ్తానని హరీశ్‌రావు సిట్‌లోని ముగ్గురు అధికారులను ఉద్దేశించి అన్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... '2018 శాసన సభ ఎన్నికల అనంతరం మీతోపాటు అప్పటి భారాస మరో సీనియర్ నేత ఫోన్లపై ఏడాదిపాటు నిఘా ఉంచిన విషయం తెలుసా' అని సిట్ అధికారులు ప్రశ్నించారు. దీనికి 'నేను నమ్మను' అని హరీశ్‌రావు చెప్పినట్లు తెలిసింది.

తరువాయి 2లో



అబుదాబిలో 'హౌస్ ఆఫ్ ఇండియా

» 5లో



## ఎన్ని విచారణలైనా చేసుకోండి.. భయపడం: కేటీఆర్

**ఈ-కబురు,హైదరాబాద్: హరీష్‌రావుకు సిట్ నోటీసులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..**

తరువాయి 2లో

## లండన్‌లో చైనా 'మెగా' ఎంబసీ.. బ్రిటన్ ఆమోద ముద్ర



**ఈ-కబురు,లండన్‌లో ఐరోపాలోనే అతిపెద్ద చైనా రాయబార కార్యాలయ నిర్మాణానికి బ్రిటన్ పచ్చ జెండా ఊపింది. ఈ ఎంబసీ (Mega Chinese Embassy) ఏర్పాటుతో భద్రతాపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే ఆందోళనల నడుమ.. ఈమేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. స్థానిక అధికారి స్టీవ్ రీడ్ ఈ భవనానికి సంబంధించిన ప్రణాళికలను ఆమోదించారు.**

తరువాయి 2లో

# పార్టీ వ్యవహారాల్లో... నబీన్ నా బాస్

"యువకుడైన నబీన్ శక్తియుక్తులు, వ్యవస్థాగత వ్యవహారాల్లో ఆయనకున్న అపార అనుభవం పార్టీకి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇకపై ఆయన నోట వచ్చే ప్రతి మాటా మాకందరికీ నూతన దిశానిర్దేశం చేస్తుంది. పార్టీ భావి కార్యాచరణకు నబీన్ మార్గదర్శకత్వం వెలకట్టలేని ఆస్తి కానుంది'' అన్నారు. "పార్టీ కార్యకర్తగా నేను కూడా నా పనితీరును ఎప్పటికప్పుడు నూతన అధ్యక్షునికే నివేదిస్తాను. నా పనితీరుకు సంబంధించిన రహస్య నివేదికను రాసేది ఆయనే. కనుక నబీన్ మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నా'' అని మోదీ చెప్పుకొచ్చారు. బీజేపీ వ్యవహారాలను చక్కబెట్టడంతో పాటు ఎన్డీఏ భాగస్వాముల నడుమ సమన్వయం సజావుగా కొనసాగేలా చూడాల్సిన బాధ్యత కూడా నబీన్‌దేనని గుర్తు చేశారు.

**కాంగ్రెస్ తప్పిదాలు మనం చేయొద్దు**

కాంగ్రెస్ తప్పిదాల నుంచి నేర్చుకోవాలని బీజేపీ నేతలు, కార్యకర్తలకు మోదీ సూచించారు. "1984 లో 50 శాతం పై చిలుకు ఓట్లతో 400కు పైగా లోక్‌సభ స్థానాలు సాధించిన కాంగ్రెస్ నేడు 100 సీట్లు కూడా నెగ్గలేక ఆపసోపాలు పడుతోంది. కనుక ఆ పార్టీ దుర్లక్షణాలన్నింటినీ నిశితంగా గమనించి మనం వాటికి దూరంగా ఉందాం. అప్పుడిక మనల్ని ఎవరూ ఓడించలేరు'' అన్నారు. నిష్పాక్షిక ఆత్మవిమర్శే బీజేపీ బలమని గుర్తు చేశారు.

"బీజేపీ ఒక సంప్రదాయం. అది ఒక కుటుంబం. సభ్యత్వం కంటే సంబంధాలకు విలువనిచ్చే పార్టీ. పదవుల ద్వారా కాకుండా ప్రక్రియ ద్వారా పనిచేసే పార్టీ బీజేపీ. ఇక్కడ అధ్యక్షులు మారినా ఆదర్శాలు, దిశానిర్దేశాలు మారవు. వాజపేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషీ వంటి దిగ్గజాల సారథ్యంలో బీజేపీ సున్నా నుంచి శిఖరస్థాయికి ఎదిగింది. వెంకయ్య నాయుడు, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా సారథ్యంలో మరింత ఎదిగింది'' అని గుర్తు చేసుకున్నారు.

**చొరబాట్లు, అర్బన్ నక్సల్స్‌తో... దేశ భద్రతకే ప్రమాదం!**

చొరబాటుదారులు, అర్బన్ నక్సల్స్ దేశ భద్రతకు పెను ప్రమాదంగా మారారని మోదీ ఆందోళన వెలిబుచ్చారు. చొరబాటుదారులను గుర్తించి తిప్పి పంపడం చాలా ముఖ్యమన్నారు. అక్రమ వలసలతో సంపన్న దేశాలు కూడా సతమతమవు తున్నాయి. వారిని వెళ్లగొడుతున్నాయి. వారు ప్రజలను కొల్లగొట్టడాన్ని భారత్ ఎప్పటికీ అనుమతించబోదు. కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు దన్నుగా నిలుస్తున్నాయి. వాటి ముసుగు తొలగించి ప్రజల ముందు నిలబెడదాం'' అని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

"దేశం ఎదుర్కొంటున్న మరో పెద్ద సమస్య అర్బన్ నక్సలిజం. "నా గురించి, ఎన్డీఏ ప్రభుత్వం గురించి సానుకూలంగా ఎవరు మాట్లాడినా లక్ష్యం చేసుకుని నోరు మూయించే కార్యక్రమం జరుగుతోంది. కొందరు జర్నలిస్టులు కూడా వారిని దారుణంగా హేళన చేసి అవమా నిస్తున్నారు. అంటరానివాళ్లుగా ముద్ర వేస్తున్నారు. ఇదంతా అర్బన్ నక్సల్స్ నూతన శైలి. వీరంతా కలిసి దేశానికి చేటు చేసేందుకు నిత్యం ప్రయత్ని స్తున్నారు'' అంటూ దుయ్యబట్టారు. వీరికి శాశ్వతంగా అడ్డుకట్ట వేయడం చాలా అవసరమన్నారు.

**అట్టహాసంగా కార్యక్రమం**

నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఆయనను మోదీ పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యాలయం కోలాహలంగా మారింది. జై శ్రీరాం, జై నితిన్ నబీన్ నినాదాలతో మార్మోగింది. ఆయన భార్య, పిల్లలు, కుటుంబీకులు, సన్నిహితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**తెలుగు నేతల సందడి**

నబీన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలు పాల్గొన్నారు. తెలంగాణ, ఏపీ బీజేపీ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు, పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శ్రీనివాసవర్మ, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, అంజిరెడ్డి తదితరులు వీరిలో ఉన్నారు. వారంతా నబీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**రాజకీయాల్లోకి యువత**

**బీజేపీ నూతన సారథి నబీన్ పిలుపు**



న్యూఢిల్లీ: రాజకీయాల్లోకి ప్రజలు మరింత చురుగ్గా రావాల్సిన అవస రముందని బీజేపీ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా అభిప్రా యపడ్డారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. తద్వారా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని కలసికట్టుగా సాకారం చేసుకుందామని పేర్కొ న్నారు. "అయితే రాజకీయాలు 100 మీటర్ల రేసు కాదు. సుదీర్ఘంగా సాగే మారథాన్. అక్కడ పరీక్ష వేగానికి కాదని, శారీరక సామర్థ్యానికి. యువత దీన్ని గుర్తించాల్సిన అవసరముంది'' అన్నారు.

బీజేపీ సారథిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం పార్టీ ప్రధాన కార్యాల యంలో ఆయన నేతలు, కార్యక ర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. బీజేపీలో ప్రతి కార్యకర్తకూ పనికి తగిన గుర్తింపు ఎప్పుడూ లభిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరి కృషినీ గుర్తించేంత శక్తియుక్తులు బీజేపీ 'వాచ్‌టవర్'కు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. కీలకమైన పశ్చిమ బెంగాల్‌తో పాటు రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా కృషి చేయాలని నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బూత్ నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి దాకా పూర్తి చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని సూచించారు. విపక్ష ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, డీఎంకేలపై నబీన్ ఈ సందర్భంగా ఘాటు విమర్శలు చేశారు. కార్తీక దీప సంప్రదాయాన్ని కూడా అడ్డుకునే కుయుక్తులకు డీఎంకే సర్కారు దిగిందన్నారు. ఇలాంటి శక్తులను ఓడించి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరముందని చెప్పారు.

# వీధి కుక్కల సామూహిక హత్య.. జంతు సంక్షేమ సంస్థల ఆందోళన



మొదటి పేజీ తరువాయి

ఈకబురు,హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వీధి కుక్కలను చట్టవిరుద్ధమైన రీతిలో వధించటాన్ని తెలంగాణ జంతు సంక్షేమ సంస్థల కార్యాచరణ కూటమి ఖండించింది. కోర్టు ఆదేశాలను తీవ్రంగా ఉల్లంఘించటంతో పాటుగా విస్తృత స్థాయి పరిపాలనా వైఫల్యం జరుగుతుందని ఆరోపించింది. విస్తృతమైన హత్యలు, తీవ్ర క్రూరత్వ ఘటనలకు సంబంధించిన కేసులను నమోదు చేసిన నేపథ్యంలో తక్షణ ప్రభుత్వ జోక్యాన్ని కోరింది.

సభ్య సంస్థలు సంకలనం చేసిన క్షేత్ర స్థాయి నివేదికల ప్రకారం.. ఈ కూటమి జనవరి 2026 మొదటి వారాల్లోనే సుమారు 500 వీధి కుక్కల హత్యను నమోదు చేసింది. అలాగే ఇటీవలి కాలంలో పదికి పైగా తీవ్రమైన క్రూరత్వ కేసులను నమోదు చేసింది. వాటిలో కుక్కలను రాడ్‌లతో కొట్టడం, బహిరంగ ప్రదేశాల్లో విష ప్రయోగం చేయడం, వాటి అవయవాలను ముక్కలు చేయడం వంటివి ఉన్నాయి. కామారెడ్డి, హన్మకొండ జిల్లాల నుండి అత్యంత తీవ్రమైన సంఘటనలు నివేదించబడ్డాయి. ఇక్కడ స్థానిక పంచాయతీ అధికారులు ఇటీవలి గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అనుసరించి వీధి కుక్కలను సామూహిక హత్యలకు ఆదేశించారు. ఈ హింస జంతువుల ప్రవర్తన వల్ల కలిగింది కాదని, మానవ నిర్లక్ష్యం, దీర్ఘకాలిక పరిపాలనా వైఫల్యం వల్ల జరిగిందని ఈ కూటమి పేర్కొంది.

హైదరాబాద్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) నిర్వహిస్తున్న "కుక్కల తొలగింపు కార్యక్రమాలు" జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, 1960 మరియు జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నియమాలు, 2023లను ఉల్లంఘిస్తున్నాయని కూటమి గుర్తుచేసింది. తగినంతగా పశువైద్య మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసింది.

# మీపైనా నిఘా ఉంచారు తెలుసా?



అందుకు సంబంధించి కొన్ని ఆధారాలను అధికారులు ఆయన ముందుంచగా అవి నకిలీవి అయి ఉంటాయని అన్నట్లు సమాచారం. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు నిందితులు ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులతో శ్రవణ్‌రావుకు మధ్య జరిగిన సంభాషణలు, లావాదేవీల గురించి సిట్ అధికారులు ప్రశ్నలడిగారు. ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులకు శ్రవణ్‌రావును ఎందుకు పరిచయం చేయించాల్సి వచ్చిందనే కోణంలో ప్రశ్నించారు. శ్రవణ్‌రావు 2023 అక్టోబరులో తన మీడియా సంస్థతో చేయించిన సర్వేలో భారాసకు 40 సీట్లు దాటడం లేదని... నిఘా విభాగం సర్వేలో మాత్రం మరోసారి అధికారంలోకి వస్తుందని ఉండటంతో ఆ అంశంపై చర్చించేందుకే వారి మధ్య సమావేశం ఏర్పాటు చేయించానని హరీశ్‌రావు చెప్పినట్లు తెలిసింది. 'అందుకు సంబంధించి జిల్లాల్లో ప్రత్యర్థి పార్టీల నేతలపై నిఘా ఉంచాలని మీరు ఆదేశించలేదా' అని అధికారులు ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని చెప్పినట్లు సమాచారం. అయితే 2023 నవంబరు 30న శాసనసభ ఎన్నికలు జరగగా... దానికి ముందురోజు వరకు శ్రవణ్‌రావు ఇచ్చిన ఫోన్ నంబర్లను ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు ట్యాప్ చేయించడానికి కారణమేంటని అడగగా హరీశ్‌రావు సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. శ్రవణ్‌రావు, ప్రణీత్‌రావుల మధ్య జరిగిన ఛాటింగ్‌ల స్క్రీన్‌షాట్‌లను ముందుంచి ప్రశ్నించగా తనకు ఆ విషయం తెలియదని చెప్పినట్లు సమాచారం. మరోవైపు ప్రభాకర్‌రావుతో సంబంధాల విషయంలో పలు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానాలు దాటవేసినట్లు తెలిసింది. ఆయనతో పెద్దగా సంబంధాలు లేవని, ఆయన తనయుడి నేపథ్యం తనకు తెలియదని అన్నట్లు సమాచారం.

**నిరంతరం నిఘా ఎలా సాధ్యమైంది?**

'దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో భారాస తరఫున ఇన్‌ఛార్జిగా ఉన్న మీరు... భాజపా అభ్యర్థి రఘునందన్‌రావు కదలికలపై నిరంతరం నిఘా ఉంచడం, కట్టడి చేయడం ఎలా సాధ్యమైంద'ని సిట్ అధికారులు ప్రశ్నించారు. రఘునందన్‌రావుకు చెందిన వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరమెందుకొచ్చిందని అడిగారు. ఫోన్ అక్రమ ట్యాపింగ్‌తోనే అది సాధ్యమైందని ఫిర్యాదులున్నాయని చెప్పారు. ఆ విషయం తనకెలా తెలుస్తుందంటూ హరీశ్‌రావు బదులిచ్చినట్లు తెలిసింది. మరోవైపు, ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిఘా విభాగానికి అవసరమైన పరికరాల కొనుగోలుకు అత్యధికంగా నిధులు మంజూరు చేయాల్సిన అవసరమేమిటని సిట్ అధికారులు ప్రశ్నించగా.. పోలీస్‌శాఖ నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు అలా చేయాల్సి వచ్చిందని చెప్పినట్లు సమాచారం.

**విచారణకు తాత్కాలిక విరామం**

హరీశ్‌రావు విచారణ సుమారు ఏడున్నర గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. తన కుమారుడికి మంగళవారం రాత్రి విమానప్రయాణం ఉందని హరీశ్‌రావు తెలపడంతో విచారణను ముగించి పంపించివేశారు. ఈ కేసు దర్యాప్తుతో సంబంధమున్న సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ సంప్రదించొద్దని, ప్రభావితం చేయొద్దని అధికారులు ఆదేశించారు. ఈ కేసులో హరీశ్‌రావును త్వరలో మరోసారి విచారణకు పిలవాలని సిట్ నిర్ణయించింది. ఒకట్రెండు రోజుల్లో మరోసారి నోటీస్ జారీ చేయనుంది. హరీశ్‌రావును విచారించిన అనంతరం మరో ఇద్దరు ప్రముఖుల్ని విచారించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు: వి.సి. సజ్జనార్**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తు... రాజకీయ నేతలు, వ్యాపారవేత్తల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ట్యాపింగ్ చేయడం, వారిపై నిఘా ఉంచడం వంటి తీవ్ర ఆరోపణలపైనే 2024 మార్చి 10 నుంచి జరుగుతోందని హైదరాబాద్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తెలిపారు. ఇప్పటికే కొందరు నిందితులపై ప్రధాన అభియోగపత్రం దాఖలు చేశామని, ఇంకా లోతుగా దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాలున్నా హరీశ్‌రావును విచారిస్తున్నారంటూ జరుగుతున్నది అసత్య ప్రచారమే అని, ప్రజలెవరూ దాన్ని నమ్మొద్దని కోరారు.

# లండన్‌లో చైనా 'మెగా' ఎంబసీ.. బ్రిటన్ ఆమోద ముద్ర



మెగా ఎంబసీ ఏర్పాటు కోసం చైనా (China) 2018లోనే టవర్ ఆఫ్ లండన్ సమీపంలో 5.4 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దీని కోసం 225 మిలియన్ పౌండ్లు చెల్లించింది. 20 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ కాంప్లెక్స్‌లో 208 రహస్య బేస్‌మెంట్ గదులు కూడా ఉంటాయని స్థానిక మీడియా వెల్లడించింది.

ఈ క్రమంలోనే ప్రతిపాదిత దౌత్య కార్యాలయాన్ని చైనా తన గూఢచర్య కార్యకలాపాలకు వినియోగించుకునే అవకాశం ఉందనే ఆరోపణలు మొదలయ్యాయి. అదేవిధంగా చైనా అసమ్మతివాదులపై నిఘా ముప్పును కూడా ఇది పెంచుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లండన్‌లో సున్నితమైన ఆర్థిక సమాచారాన్ని చేరవేసే భూగర్భ కేబుళ్లకు ఈ ప్రదేశం చాలా దగ్గరగా ఉందనే వాదనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. అనుమతి విషయంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పదేపదే వాయిదా వేసింది.

**గ్రీన్‌లాండ్ స్వాధీనానికి మరో కారణం చెప్పిన ట్రంప్**

మరోవైపు.. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే విషయంలో ఏడేళ్ల జాప్యంపై చైనా నిరసన తెలిపింది. బ్రిటన్ ఈ విషయాన్ని సంక్లిష్టం చేస్తూ, రాజకీయ రంగు పులుముతోందని ఆరోపించింది. వరుస జాప్యాలు, చట్టపరమైన సవాళ్ల అనంతరం ఎట్టకేలకు ప్రభుత్వ ఆమోదం లభించింది. జాతీయ భద్రత సమస్యలను పరిగణనలోకి తీసుకున్నామని, వాటి పరిష్కారానికి పోలీసులు, సంబంధిత విభాగాలతో మాట్లాడాకే ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# కాలుష్య రహితం.. పర్యావరణ హితం




**సీఎంతో 'ఎక్స్‌పర్టైజ్' భేటీ**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యంపై సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్‌పర్టైజ్' ఆసక్తి చూపింది. సీఎం రేవంత్‌తో ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈఓ మొహమ్మద్ ఆసిఫ్ భేటీ అయ్యారు. తమ సంస్థలో ఏటా సుమారు 5 వేల మంది నైపుణ్యం కలిగిన సిబ్బంది నియామకం జరుగుతోందని, యంగ్ ఇండియాతో భాగస్వామ్యం తమకు ఉపకరిస్తుందని చెప్పారు.

విద్యా, ఉద్యోగ అవకాశాల నడుమ ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు సీఎం చెప్పారు. మధ్య ఆసియా ప్రాంతంలో ఎక్స్‌పర్టైజ్ సంస్థ పెట్రో కెమికల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎరువులు, స్టీల్, సిమెంట్, వాటర్ ట్రీట్‌మెంట్, విద్యుత్ ఉత్పత్తి వంటి నైపుణ్యాధారిత రంగాల్లో ప్లాంట్ నిర్వహణ సేవలను అందిస్తోంది.

**తెలంగాణతో భాగస్వామ్యంపై రాయల్ ఫిలిప్స్ ఆసక్తి**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యంపై హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై చర్చించేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో భేటీ సందర్భంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ ఈ విషయం వెల్లడించారు. ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలను ప్రశంసించారు.

కాగా ఇటీవల విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్ -జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' ప్రత్యేకతలను రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. ఔషధ తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని సదర్శించాల్సిందిగా సీఎం రేవంత్‌ను రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ ఆహ్వానించారు.

**పలు రంగాల్లో కలిసి పనిచేస్తామన్న గూగుల్**

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. సీఎం రేవంత్‌తో భేటీ అయిన గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా ఈ విషయాలు వెల్లడించారు.

ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. తొలి 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు సంస్థ బృందానికి రేవంత్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆయా అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని గుప్తా అన్నారు.

**యూనిలీవర్ జీసీసీ**

ప్రపంచ వ్యాప్తంగా వస్తు వినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుపై ఆసక్తి వ్యక్తం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో జీసీసీ ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించారు.

ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ చైర్మన్ అలోన్ స్టోపెల్‌తో కూడా సీఎం భేటీ అయ్యారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయెల్ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

# వామపక్షాలు బలపడితేనే ప్రజాస్వామ్యం పదిలం

ఖమ్మంలో నిర్వహిస్తున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన 'నేటి భారతదేశం వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాజా ప్రసంగించారు. బ్రిటిష్ వలసవాదులతో రాజీపడిన ఆర్‌ఎస్‌ఎస్‌కు పోరాట చరిత్ర లేదని విమర్శించారు. కేరళలో వామపక్ష కూటమి తిరిగి అధికారంలోకి రావాలని, పశ్చిమబెంగాల్‌లో పుంజుకొని పాలనా పగ్గాలు చేపట్టాలని ఆకాంక్షించారు. తమిళనాడు, పుదుచ్చేరిలలో లౌకికవాదాన్ని కాపాడాలని, భాజపాను అడుగుపెట్టనివ్వవద్దని కోరారు.

**రాజ్యాంగాన్ని మార్చే కుట్ర**

ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మగా మారిన భాజపా.. పార్లమెంటరీ వ్యవస్థ, జనాభా గణనను దుర్వినియోగం చేస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి అన్నారు. "ఎన్‌కౌంటర్ పేరిట మావోయిస్టులను చంపటం నాగరిక సమాజం అంగీకరించదు. సర్ పేరిట భాజపా.. ఓటర్ల జాబితా నుంచి ఆ పార్టీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం.. భారత ప్రయోజనాల కంటే ఇజ్రాయెల్, అమెరికా అవసరాల కోసం పనిచేస్తోంది'' అని విమర్శించారు.

దేశంలో రక్షణ, అణుశక్తి రంగాలను ప్రైవేటీకరించటం వెనుక కార్పొరేట్ శక్తుల ఒత్తిడి ఉందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఆరోపించారు. కాలానికి అనుగుణంగా కమ్యూనిస్టులు పనిచేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని ఏఐఎఫ్‌బీ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీ సందోష్‌కుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.

**ఐక్య పోరాటాలు చేయాలి..**

కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రాజ్యాంగంలో మార్పులు చేయటానికి ప్రయత్నిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. "రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటేనే సామాన్యులకు హక్కులు దక్కుతాయి. కార్పొరేట్, ఫాసిస్టు శక్తులు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు సవాళ్లు విసురుతున్నాయి. వాటికి అడ్డుకట్ట పడాలంటే ఐక్య పోరాటాలు అవసరం. వామపక్ష భావజాలం కలిగిన పార్టీలు మనుగడ సాగించాల్సిన అవసరం ఉంది. దేశానికి స్వాతంత్ర్యం సాధించటంలో సీపీఐ ప్రముఖ పాత్ర పోషించింది. ఆ పార్టీ సాగించిన సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచానికి కొత్త సందేశం ఇచ్చింది'' అని అన్నారు.



# ఎన్ని విచారణలైనా చేసుకోండి.. భయపడం: కేటీఆర్



ఫోన్ ట్యాపింగ్ కేసు.. ఓ లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యానించారు. విచారణ, కమీషన్ల పేరుతో మా పార్టీని నేతలను వేధిస్తున్నారని.. రాజకీయ వేధింపుల్లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్‌రావుకు నోటీసులు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

“మీరు ఎన్ని విచారణలైనా చేసుకోండి.. మేం భయపడం. ఈ లొట్టపీసు కేసులో కేసీఆర్‌కు కూడా నోటీసులు ఇస్తారంట.. ఇచ్చుకోండి” కేటీఆర్ వ్యాఖ్యానించారు. “ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టేశాయి. అయినా ఎంక్వైరీలు చేయిస్తున్నారు. డెవర్షన్ పాలిటిక్స్ రేవంత్‌కు వెన్నతో పెట్టిన విద్య. రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డికి కోల్ టెండర్లు దక్కేలా ప్రయత్నాలు జరిగాయి. సింగరేణిలో స్కామ్‌ను నేను ఆధారాలతో సహా బయటపెడతా.. సింగరేణిలో రేవంత్ బావమరిదిని కింగ్‌పిన్ చేసి ఆయన రింగ్ తిప్పేలా చేశారు” అని కేటీఆర్ ఆరోపించారు.

“కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సింగరేణి దోపిడీ మొదలైంది. సింగరేణి టెండర్లపై హరీష్ చేసిన కామెంట్స్‌పై ప్రభుత్వం ఎందుకు స్పందించదు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం లేదు. నైని కోల్ బ్లాక్ రద్దు వెనుక వాటాల పంచాయితీ ఉంది. నైని కోల్ బ్లాక్ కుంభకోణంపై హరీష్ మాట్లాడారనే అక్కసుతో నోటీసులు. అసెంబ్లీలో మంత్రులను హరీష్ ఫుట్‌బాల్ ఆడుకున్నారు” అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

## ఎనర్జీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన వేం నరేందర్ రెడ్డి

ఈ-కబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ ఎనర్జీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ వేం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కొండాపూర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎనర్జీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. తులసీ నాగమణి, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ సిహెచ్. చంద్రుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేంనరేందర్ రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రికార్డు అసిస్టెంటు నుంచి చీఫ్ జనరల్ మేనేజర్ వరకు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఉద్యోగుల జీతాలను సకాలంలో చెల్లిస్తున్నందుకు అసోసియేషన్ అధ్యక్షురాలు తులసీ నాగమణి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్పిడిసిఎల్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, మురళీ, ఎన్పిడిసిఎల్ అసోసియేషన్ నాయకులు సుభాష్, రోహన్, బాలాజీ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ నాయకులతో కలిసి క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న వేం నరేందర్ రెడ్డి తదితరులు

# ఖాజాగూడ చెరువు కబ్జాలపై హైడ్రా దృష్టి

**ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఖాజాగూడ పెద్ద చెరువు కబ్జాల లెక్కలు తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది. ఖాజాగూడ పెద్ద చెరువు తూములు, అలుగులు మూసేయడం., దారి మళ్లించడం పై మీడియాలో వచ్చిన కథనాలతో పాటు.. ప్రజల నుంచి ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖాజాగూడ చెరువు అలుగుతో పాటు తూములు మూసేయడం, నీటి ప్రవాహాన్ని డైవర్ట్ చేసినట్టు గుర్తించారు. ఖాజాగూడ చెరువు కింద భాగంలో చెరువుకు అనుసంధానంగా ఉన్న కట్ట బంధాన్ని రూపురేఖలు మార్చినట్టు గుర్తించారు. చెరువు ఆనవాళ్లు లేకుండా చేయడాన్ని గమనించారు. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంతమంది ఆక్రమించుకుని షెడ్డులు నిర్మించినట్టు గుర్తించారు. చెరువు భూమిలో అక్రమ షెడ్లు వేసి అంటున్నవారి వద్ద పత్రాలను పరిశీలించాలని హైడ్రా నిర్ణయించింది.



ఖాజాగూడ పెద్ద చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# డీయెగో గార్సియాపై ట్రంప్ కన్ను



మారిష్‌సకు తిరిగి ఇచ్చేందుకు ఒప్పందం..

ఒకప్పుడు మారిష్‌సలో భాగమైన చాగో దీవుల సముదాయంలోని పెద్ద దీవి డీయెగో గార్సియా. మారిషస్ ప్రధాన భూభాగానికి 2,112 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ దీవి విస్తీర్ణం కేవలం 30 చదరపు కిలోమీటర్లే. హిందూ మహా సముద్రంలో భారత్‌కు దిగువన, మాల్దీవులకు సమీపంలో ఉంటుంది. భారత్, చైనా తోపాటు అటు గల్ఫ్, ఆఫ్రికా దేశాలు.. ఇటు ఆగ్నేయాసియా ప్రాంతాలకు మధ్యలో ఉండటంతో అటు సముద్ర రవాణాపై నిఘాకు, ఇటు సైనికపరంగా అత్యంత కీలక ప్రాంతమిది. మారిషస్ తమ వలస పాలనలో ఉన్నప్పటి నుంచీ డీయెగో గార్సియాపై బ్రిటన్‌కు పట్టుంది. మారిష్‌సకు 1968లో స్వాతంత్ర్యం ఇచ్చిన బ్రిటన్.. అప్పటి మారిషస్ పాలకులపై ఒత్తిడి తెచ్చి డీయెగో గార్సియా దీవిని కొనుగోలు చేసింది. అక్కడి ప్రజలను బయటికి తరలించి, అమెరికాతో కలిసి సైనిక స్థావరం ఏర్పాటుకు చర్యలు మొదలు పెట్టింది.

మారిష్‌సకు భారత్ మద్దతు

డీయెగో గార్సియాను తమకు తిరిగి ఇచ్చేయాలని కొన్నేళ్లుగా యూకేపై మారిషస్ ఒత్తిడి పెంచింది. అంతర్జాతీయ కోర్టులో కేసులు కూడా వేసింది. మారిష్‌సకు అనుకూలంగా అంతర్జాతీయ కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా యూకే వినలేదు. అయితే హిందూ మహా సముద్రంలో అమెరికా సైనిక స్థావరంతో సమస్య ఉండటంతో.. మారిష్‌సకు భారత్ మద్దతుగా నిలిచి యూకేపై ఒత్తిడి తెచ్చింది. ఈ క్రమంలోనే 2025 మేలో డీయెగో గార్సియా సహా చాగో దీవులను మారిష్‌సకు తిరిగిచ్చేందుకు యూకే ఒప్పందం చేసుకుంది. అయితే 99 సంవత్సరాల పాటు అంటే 2124 వరకు మారిషస్ ఆ దీవులను యూకేకు లీజు కు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం యూకే ఏటా రూ.1,235 కోట్లు (10 కోట్ల పౌండ్లు) అద్దె కింద చెల్లిస్తుంది. ప్రధాన భూభాగానికి దూరంగా ఉన్న ఈ దీవుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం మారిష్‌సకు భారత్ రూ.6,100 కోట్లు ఆర్థిక సాయం కూడా చేస్తోంది. అక్కడ ఒక శాటిలైట్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ఒప్పందానికి మొదట్లో ట్రంప్ కూడా మద్దతిచ్చారు. కానీ ఇప్పుడు నాలుక మడతేశారు.

అప్పట్లో భారత్.. తర్వాత చైనా టార్గెట్‌గా..

హిందూ మహా సముద్రంలో తన మిలటరీ అవసరాల కోసం మొదట్లో డీయెగో గార్సియాలో సాధారణ స్థావరాన్ని, కమ్యూనికేషన్ కేంద్రాన్ని అమెరికా ఏర్పాటు చేసింది. కానీ 1971 భారత్‌పాక్ యుద్ధం, బంగ్లాదేశ్ విమోచన సమయంలోని పరిణామాలతో.. భారత్ లక్ష్యంగా డీయెగో గార్సియాను పెద్ద సైనిక, వైమానిక స్థావరంగా మార్చింది. ఆ యుద్ధ సమయంలో పాకిస్థాన్‌కు అండగా నిలిచేందుకు అమెరికా ముందు కొచ్చింది. యుద్ధంలో భారత్ విజయం సాధించి బంగ్లాదేశ్ విముక్తి జరిగిపోవడంతో.. అమెరికాను ఆలోచనలో పడేసింది. భారత్ లక్ష్యంగా, హిందూ మహా సముద్రంలో పట్టుకోసం డీయెగో గార్సియాను బలమైన వ్యూహాత్మక సైనిక, వైమానిక స్థావరంగా మార్చింది. ప్రపంచ యవనికపైకి చైనా కూడా పోటీగా దూసుకురావడంతో దీనిని మరింత విస్తరించింది. ప్రస్తుతం అక్కడ బీ2, బీ52 బాంబర్లు, ఎఫ్ సిరీస్ యుద్ధ విమానాలు, సైనిక రవాణా విమానాలు, హెలికాప్టర్లతోపాటు సుమారు 5 వేల మంది వరకు బలగాలు ఉన్నట్టు అంచనా.

## మద్యం మత్తులో ఎన్ఆర్ఐపై దాడి చేసిన 'పొలిటికల్' స్నేహితులు



**మత్తు దిగిన తరువాత పోలీస్ స్టేషన్ లో 'రాజీ'**

**శేరిలింగంపల్లిలో చర్చనీయాంశంగా ఘటన**

ఈకబురు, శేరిలింగంపల్లి : సెలవుల కోసం నగరానికి వచ్చిన ఓ ఎన్ఆర్ఐకి తన పొలిటికల్ స్నేహితుల చేతిలో చేదు అనుభవం ఎదురైంది. మాటామాటా పెరిగి ఇద్దరు స్నేహితులు తమ ఎన్ఆర్ఐ స్నేహితుడి మీద దాడి చేయడం... అనంతరం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు... మత్తు దిగిన తరువాత ఇరువర్గాల మధ్య రాజీ కుదరడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ఓ ఎన్ఆర్ఐ సేలవుల కోసం ఇటీవల నగరానికి వచ్చాడు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ఆర్ఐ కుటుంబం నివాసం ఉంటుండగా, ఇతనికి ఇద్దరు రాజకీయ నాయకులు స్నేహితులు ఉన్నారు. వీరు ముగ్గురు కలిసి గత మూడు రోజుల క్రితం మాదాపూర్ లో ఓ విందుకు వెళ్లారు. కాగా అక్కడ మద్యం సేవించిన ముగ్గురు స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి వివాదం చోటుచేసుకుంది. దీంతో గోపన్ పల్లికి చెందిన స్నేహితుడు ఎన్ఆర్ఐ స్నేహితుడి మీద దాడి చేసి కొట్టాడు. అనంతరం అక్కడే ఉన్న మరో స్నేహితుడితో కలిసి చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతానికి ఎస్ఆర్ఐ ని తీసుకువచ్చారు. అక్కడ వీరితో పాటు ఉన్న.. గతంలో ఓ కేసులో శిక్ష అనుభవించి బెయిలు మీద బయటకు వచ్చిన మరో స్నేహితుడు సైతం ఎన్ఆర్ఐ స్నేహితుడి మీద దాడి చేశాడు. ఈ క్రమంలో ఒకరి మీద ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం దాడి చేసిన స్నేహితుడు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్ఆర్ఐ స్నేహితుడి మీద దాడి చేశాడంటూ పిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా తెల్లవారిన తరువాత గచ్చిబౌలి పోలీసులు ఎన్ఆర్ఐని పోలీస్ స్టేషన్ కు పిలిపించి 5 గంటల పాటు పోలీస్ స్టేషన్ లో ఉంచినట్లు తెలుస్తుంది. కాగా ముగ్గురు స్నేహితులే కావడంతో పోలిస్ స్టేషన్ లో ఇరువర్గాలు రాజీ చేసుకొని కేసు వాపస్ తీసుకున్నారు. కాగా బాధితుడు ఎన్ఆర్ఐ కావడం, దాడి చేసిన వారు రాజకీయ నాయకులు కావడంతో ఈ విషయం శేరిలింగంపల్లిలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై గచ్చిబౌలి ఇన్స్ పెక్టర్ మాట్లాడుతూ స్నేహితులు దాడి చేసుకొని పిర్యాదు చేశారని, అనంతరం పిర్యాదు వెనక్కు తీసుకోవడంతో వదిలిపెట్టినట్లు తెలిపారు.

## అబుదాబిలో 'హౌస్ ఆఫ్ ఇండియా



ఈ-కబురు,భారత్-యూఏఈ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. భారతీయ సంస్కృతి, చరిత్రను చాటిచెప్పేలా అబుదాబిలో ‘హౌస్ ఆఫ్ ఇండియా’ ఏర్పాటుకు యూఏఈ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత పర్యటనలో భాగంగా తీసుకున్న అత్యంత కీలకమైన నిర్ణయాలలో ఇదొకటి. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'లూవ్రే అబుదాబీ'వంటి మ్యూజియం ఉన్న సాదియాత్ కల్చరల్ డిస్ట్రిక్ట్ లోనే ఈ 'హౌస్ ఆఫ్ ఇండియా'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం విశేషం.

ఇందులో యోగా,ఆయుర్వేదం వంటి భారతీయ పురాతన సంప్రదాయాలను డిజిటల్ గ్యాలరీల రూపంలో పర్యాటకులకు వివరించనున్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, భారతీయ పారిశ్రామికవేత్తలు, కళాకారులు, విద్యావేత్తలు సమావేశమయ్యేలా ఒక 'బిజినెస్ అండ్ కల్చరల్ హబ్'గా ఈ హౌస్ ఆఫ్ ఇండియా పనిచేయనుంది.

ఇప్పటికే అబుదాబిలో బీఏపీఎస్ హిందూ దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయం ప్రధాని నరేంద్ర చేతుల మీదగా ప్రారంభమైంది. కాగా యూఏఈ అధ్యక్షుడు కేవలం రెండు గంటల పర్యటన కోసం భారత్‌కు సోమవారం(జనవరి 19) వచ్చిన సంగతి తెలిసిందే.

## సినిమా టికెట్ ధరల పెంపును 90 రోజుల ముందే వెల్లడించాలి

ఈకబురు,హైదరాబాద్: సినిమా టికెట్ ధరల పెంపు వ్యవహారంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి తీరుపై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో టికెట్ ధరలను పెంచరాదంటూ స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ‘మన శంకరవరప్రసాద్ గారు’ సినిమా విషయంలో ఎలా అనుమతించారని నిలదీసింది. ‘రాజాసాబ్’తోపాటు ఈ సినిమాకూ ఒకే రోజు టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ మెమో జారీ చేసినప్పుడు.. ఆ విషయాన్ని కోర్టు దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచొద్దని హైకోర్టు ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసీ ఈ నెల 10న పబ్లిక్ డొమైన్‌లో ‘ధరల పెంపు మెమో’ను పెట్టడంపై సుమోటో కోర్టు ధిక్కరణగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపింది. హోంశాఖ ముఖ్యకార్యదర్శి సీవీ ఆనంద్‌కు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు జారీ చేసింది. ఇకపై టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని సినిమా విడుదలకు 90 రోజుల ముందే వెల్లడించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ‘మన శంకరవరప్రసాద్ గారు’ సినిమా టికెట్ ధరల పెంపును సవాలు చేస్తూ న్యాయవాది డి.చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజాసాబ్ సినిమాతోపాటు ‘మన శంకరవరప్రసాద్ గారు’ టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి 8న మెమో జారీ చేశారన్నారు. ‘రాజాసాబ్’ టికెట్ ధరల పెంపు అమలును నిలిపివేయడంతోపాటు భవిష్యత్తులో పెంపునకు ఎలాంటి మెమోలు జారీ చేయరాదంటూ ఈ కోర్టు 9న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ 8న జారీ అయిన మెమోను 10న వెల్లడించారని పేర్కొన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. దీనిపై ప్రశ్నించగా ప్రభుత్వ సహాయ న్యాయవాది వివరణ ఇవ్వలేకపోయారు. ఈ విషయాన్ని సుమోటో కోర్టు ధిక్కరణగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని సినిమా విడుదలకు 90 రోజుల ముందే వెల్లడించాలన్న పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి.. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, నగర పోలీసు కమిషనర్‌లకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ‘మన శంకరవరప్రసాద్ గారు’ టికెట్ ధరల పెంపుపై హోంశాఖ ముఖ్యకార్యదర్శి, నగర పోలీసు కమిషనర్, షైన్ స్క్రీన్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను ఇతర పిటిషన్లతో కలిపి ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేశారు.

## ఫోన్‌పే ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్




దిల్లీ: వాల్‌మార్ట్ నేతృత్వంలోని ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే పబ్లిక్ ఇష్యూకు (Phonepe IPO) మార్గం సుగమం అయ్యింది. ఈ ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ (SEBI) నుంచి ఆమోదం లభించింది. సెబీ సూచించిన మార్పులు చేర్పులకు అనుగుణంగా అప్‌డేటెడ్ డీహెచ్‌ఆర్‌పీని ఫోన్‌పే త్వరలో సమర్పించనుంది. అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఐపీఓ త్వరలోనే పట్టాలెక్కనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ఫోన్‌పే ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను పబ్లిక్ ఇష్యూ ద్వారా విక్రయించనున్నారు. ఫ్రెష్ ఇష్యూ ఉండబోదని తెలుస్తోంది. అంటే కంపెనీకి పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎలాంటి నిధులూ రావన్నమాట. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్ మార్కెట్‌లో ఫోన్‌పేదే హవా. మొత్తం యూపీఐ లావాదేవీల్లో 45 శాతం ఈ యాప్ ద్వారానే జరుగుతున్నాయి. 2025 డిసెంబర్‌లో మొత్తం 9.8 బిలియన్ లావాదేవీలను ప్రాసెస్ చేసిందని ఎన్‌పీసీఐ డేటా చెబుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.7115 కోట్ల ఆదాయం పొందింది. ఐపీఓ సైజ్, ధరల శ్రేణి వంటి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ఐపీఓ సుమారు రూ.12వేల కోట్లు ఉంటుందని అంచనా.

# టయోటా నుంచి తొలి ఈవీ.. సింగిల్ ఛార్జ్‌తో 543 km

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ (Toyota) దేశంలో తొలి విద్యుత్ కారును విడుదల చేసింది. అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా (Toyota Urban Cruiser Ebella) పేరిట దీన్ని లాంచ్ చేసింది. ప్రస్తుతం ఈవీలకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మిడ్ సైజ్ ఎస్‌యూవీని దేశీయ మార్కెట్లోకి టయోటా లాంచ్ చేసింది. హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జడ్ఎస్, మారుతీ సుజుకీ ఇవిటారాకు ఈ కారు పోటీ ఇవ్వనుంది.

టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా రెండు బ్యాటరీ వేరియంట్లలో (49 kWh, 69 kWh) లభ్యమవుతుంది. అధిక బ్యాటరీ సామర్థ్యం కలిగిన వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇందులో అమర్చిన మోటార్ 172 బీహెచ్‌పీ, 189 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. తక్కువ బ్యాటరీ సామర్థ్యం కలిగిన మోడల్‌లో అమర్చిన మోటార్ 142 బీహెచ్‌పీ, 189 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ధర వివరాలు ఇంకా వెల్లడి కాలేదు.ఇది మారుతీ సుజకీ eవిటారా రీ బ్యాడ్జ్డ్ వెర్షన్. కానీ, దీనికి టయోటా స్పెసిఫిక్ స్టైలింగ్ ఎలిమెంట్లు జోడించారు. ఎల్ఈడీ డీఆర్ఎల్స్, హెడ్‌ల్యాంప్‌లు, బంపర్‌లో మార్పులు చేశారు. సైడ్ ప్రొఫైల్‌లో పెద్దగా మార్పులు చేయలేదు. 18 అంగుళాల అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. ఐదు మోనోటోన్, నాలుగు డ్యూయల్ టోన్ ఎక్స్‌టీరియర్ కలర్ ఆప్షన్లతో ఈ కారు లభ్యమవుతుంది. క్యాబిన్ లేఔట్ కూడా పెద్దగా మార్పు చేయలేదు. ముందువైపు 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. ఇది వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లేకు సపోర్ట్ చేస్తుంది.

పనోరమిక్ సన్‌రూఫ్, 12 కలర్ ఆప్షన్లతో కూడిన యాంబియెంట్ లైటింగ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్ ఉన్నాయి. వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఆటోమేటిక్ క్లయిమేట్ కంట్రోల్, మల్టిపుల్ యూఎస్‌బీ పోర్ట్స్ ఇచ్చారు. ఇన్‌క్యాబిన్ ఎయిర్‌ప్యూరిఫైర్ సదుపాయం కూడా ఉంది. స్టాండర్డ్‌గా ఏడు ఎయిర్‌బ్యాగులు ఇస్తున్నారు. ఏబీఎస్, ఈబీడీ, ఈఎస్‌పీ, 360 డిగ్రీల కెమెరా, లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి. 8 ఏళ్ల బ్యాటరీ వారెంటీతో పాటు, బ్యాటరీ యాజ్ సర్వీస్ ఆప్షన్ కూడా కంపెనీ అందిస్తోంది. ఈ కారుపై 60 శాతం అష్యూర్డ్ బైబ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు టయోటా పేర్కొంది.






## డెలివరీ ఉద్యోగాలను గిగ్‌వర్క్‌గా చూడొద్దు
# స్విగ్గీ ఎగ్జిక్యూటివ్




ఫుడ్ డెలివరీ రంగంలో గిగ్ వర్క్ (Gig work) మోడల్ పదం తరచూ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో డెలివరీ జాబ్స్ గురించి ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాటిని గిగ్ వర్క్‌గా చూడొద్దన్నారు. జాబ్ మార్కెట్‌కు డెలివరీ పార్ట్‌నర్లు మూడో పిల్లర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు స్పందించారు. "గిగ్.. ఈ పదం ఫ్యాన్సీగా అనిపిస్తుంది కానీ దీనిని సౌకర్యవంతమైన ఉపాధి మార్గంగా చూడాలి. ఈ ఉద్యోగాలను నేను మూడో పిల్లర్‌గా భావిస్తాను. మొదటి పిల్లర్.. ఫార్మల్ ఎంప్లాయ్‌మెంట్. ఇదొక లాంగ్‌టర్మ్ జాబ్. రెండోది.. ఔత్సాహిక వ్యాపారం. అంటే చిన్నదో, పెద్దదో సొంతంగా పనిచేయడానికి ఎంచుకున్న మార్గం. ఇక ఈ డెలివరీ జాబ్స్ (Delivery jobs).. జీవనోపాధిలో అత్యంత కీలకమని నేను భావిస్తున్నాను. గత ఏడాది ఒకా నొకదశలో 25 లక్షల మంది స్విగ్గీ వేదికగా ఉపాధి పొందారు. ఈ లెక్కలు కేవలం మా వేదిక గురించే. ఇంకా ఈ రంగంలో వృద్ధికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయి.

ఇక్కడ నేను చేసే అభ్యర్థన ఒక్కటే. ఫార్మల్ ఎంప్లాయ్‌మెంట్‌కు ఇది భిన్నం. ఆ ఉపాధి మార్గంలో ఉన్న నిబంధనలే ఇక్కడికి తీసుకువస్తే.. డెలివరీ జాబ్స్‌కున్న భిన్నమైన లక్షణాన్ని అణచివేసినట్లే అవుతుంది. ఈ ఉపాధి లక్షణాలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ఈ డెలివరీ జాబ్ ఇలాగే ఉంటుందని గిరిగీసుకోలేం. ఈ పనిని కొందరు దీర్ఘకాలం చేయాలనుకుంటారు. మరికొందరు నెలలు మాత్రమే ఈ ఉద్యోగంలో ఉంటారు. విద్యార్థులు తమ ఖర్చుల కోసం, ఇంకొందరు అదనపు ఆదాయం కోసం దీనిని ఎంచుకుంటారు. ఈ ఫ్లెక్సిబుల్ విభాగంలోకి వచ్చేవారు చాలామంది ఉన్నారు" అని కపూర్ వెల్లడించారు (Swiggy)

## బంగారం, వెండి టీ20 బ్యాటింగ్..
# లక్షన్నర దాటిన పసిడి!




**బంగారం, వెండి ధరలు దూసుకెళుతున్నాయి. టీ20 మ్యాచ్‌లో బ్యాటర్ల అవతారం ఎత్తి తమ వీరోచిత ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాయి. పసికూనపై ఓపెనర్లుగా దిగిన బ్యాటర్ల మాదిరిగా పరుగుల కసిని తీర్చుకుంటున్నాయి. ఆకాశమే హద్దుగా సిక్సర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలోనే స్కోరుబోర్డుపై తొలిసారి వెండి రూ.3 లక్షల మార్కును నమోదు చేయగా.. తానేమీ తీసిపోను అన్నట్లుగా బంగారం రూ.1.50 లక్షల మార్కును చేరుకుంది. తక్కువ ధరలో ఉన్నప్పుడు కొనుగోళ్లు జరిపిన వారు దీన్ని చూసి కేరింతలు కొడుతుండగా.. తగ్గితే కొందామని భావిస్తున్న మధ్యతరగతి వ్యక్తి ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యాడు.**

మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో (MCX) మార్చి నెల డెలివరీ కిలో వెండి ధర మంగళవారం మరో రూ.9,674 పెరిగి రూ.3.19 లక్షలకు చేరువైంది. ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం ఫిబ్రవరి డెలివరీ ఒక్క రోజులోనే రూ.2,560 పెరిగి రూ.1.48 లక్షలకు చేరింది.

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నానికి 10 గ్రాముల బంగారం ధర తొలిసారి రూ.1.50 లక్షలు దాటింది. వెండి రూ.3.15 లక్షల వద్ద ట్రేడవుతోంది.

అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,714 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 94.37 డాలర్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 91 మార్కును దాటడంతో ఆ ప్రభావం కూడా దేశీయంగా వీటి ధరల పెరుగుదలకు దోహదం చేస్తోంది.

**సురక్షితమని భావించి..**

మొన్నటికి మొన్న వెనెజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేసి ఆ దేశ రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చేసిన ట్రంప్.. మరోవైపు ఇరాన్‌పై కయ్యానికి కాలు దువ్వుతున్నారు. అంతలోనే అమెరికా భద్రతను సాకుగా చూపుతూ గ్రీన్‌లాండ్‌పై మనసుపడిన ట్రంప్.. ఆ దేశాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని దూకుడుగా అడుగులు వేస్తున్నారు. తద్వారా ప్రపంచాన్ని మరోసారి అనిశ్చితిలోకి నెట్టివేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సురక్షితమని భావిస్తూ బంగారం, వెండి పైకి పెట్టుబడులు రావడమే వీటి ధరలు గణనీయంగా పెరగడానికి కారణమని బులియన్ వర్తకులు చెబుతున్నారు. మరోవైపు కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతుండడంతో వైట్ గోల్డ్‌కు ఎప్పుడూలేనంత డిమాండ్ ఏర్పడింది.



## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు.. ఒక్కరోజే రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి

భారత స్టాక్ మార్కెట్ నేడు భారీ నష్టాలను చవిచూసింది. అంతర్జాతీయ ప్రతికూల పవనాలు, ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడితో దేశీయ సూచీలు ఒక్కసారిగా కుప్పకూలాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ (Sensex) ఏకంగా 1,065 పాయింట్లకు పైగా నష్టపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 82,180 పాయింట్ల వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ (Nifty) కూడా భారీగా నష్టపోయింది. నిఫ్టీ 360 పాయింట్లు కోల్పోయి, 25,232 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో ఒక్క రోజే ఇన్వెస్టర్ల రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. ప్రధానంగా హెవీవెయిట్ షేర్లలో అమ్మకాలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలే ఈ భారీ పతనానికి కారణమని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. దాదాపు అన్ని రంగాలు నేడు నష్టాల్లోనే ట్రేడ్ అవ్వడం గమనార్హం.

# తెలుగు రాష్ట్రాల్లో నేడు పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయంటే..?

పెట్రోల్, డీజిల్ ధరలు గత కొంతకాలంగా స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే గత సంవత్సరం దేశవ్యాప్తంగా లీటర్ పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచుతూ కేంద్ర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో వాహనదారులు ఆందోళనకు గురి అయ్యారు. కానీ, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. పెరిగిన ధరల ప్రభావం ప్రజలపై ఉండదని స్పష్టం చేసింది. ఎక్సైజ్ సుంకాన్ని ఆయిల్ కంపెనీలే భరిస్తాయని పేర్కొంది. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ప్రతి నెల ఒకటో తారీకున అయిన వీటి ధరల్లో మార్పులు జరుగుతాయి. ఇందులో భాగంగా ఈ నెలలో అయినా ధరల్లో మార్పు జరిగి ప్రజలకు ఊరట లభిస్తుందేమో అని ఎదురు చూడగా.. ఈ నెలలో కూడా ధరల్లో ఎంలాంటి మార్పులు జరగకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో ఈరోజు పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..


హైదరాబాదు
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107. 46
లీటర్ డీజిల్ ధర రూ: రూ. 95. 70


విశాఖపట్నం
లీటర్ పెట్రోల్ ధర: రూ. 108. 38
లీటర్ డీజిల్ ధర రూ: రూ. 96. 26

విజయవాడ
లీటర్ పెట్రోల్ ధర: రూ. 109.02
లీటర్ డీజిల్ ధర రూ: రూ. 96. 85



## స్నేహగీతం





నువ్వా నేనా అన్నట్టుగా ఒకప్పుడు పోటాపోటీగా అవకాశాల్ని అందుకుంటూ సినిమాలు చేసిన కథానాయికలు నయనతార, త్రిష. 2000 దశకంలో ఈ ఇద్దరూ స్టార్ కథానాయికలుగా ఎదిగారు. అప్పట్లో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు కూడా ఉన్నట్టు ప్రచారం సాగింది. అలాంటి తారలు తమ మధ్య పోటీని, అభిప్రాయ బేధాల్ని పక్కనపెట్టి... స్నేహగీతాన్ని ఆలపిస్తూ ఇటీవల విదేశాల్లో హాయిగా విహరించారు. ఆ సందర్భంలో తీసుకున్న ఫొటోల్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. వెంటనే అవి వైరల్‌గా మారాయి. ఇంచుమించు ఒకే సమయంలో కెరీర్‌ని మొదలుపెట్టిన ఈ ఇద్దరు కథానాయికలు కొత్తతరానికి దీటుగా నేటికీ వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు.

## బ్లూ కలర్ డ్రెస్సులో వెంకటేష్ భార్య.. సో సూపర్ అంటూ కామెంట్స్

టాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్(Aishwarya Rajesh) గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'కౌసల్య కృష్ణమూర్తి'(Kousalya Krishnamurthy) సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ బ్యూటీ ఆ తర్వాత వరుస సినిమాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్నది. ఇక రీసెంట్‌గా అనిల్ రావిపూడి(Annil Ravipudi) దర్శకత్వంలో వెంకటేష్(Venkatesh) హీరోగా వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం'(Sankranti Ki Vastunnam) మూవీలో నటించి మెప్పించింది.

మీనాక్షి చౌదరి(Meenakshi Chowdary) కూడా నటించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దీంతో ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు తలుపులు తడుతున్నాయి. ప్రజెంట్ చేతి నిండా సినిమాలతో బాగా బిజీ అయిపోయింది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియా(Social Media)లో కూడా బాగా యాక్టీవ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌కు కూడా దగ్గరవుతూ ఉంటుంది. నిత్యం ఏదో ఒక విషయం గురించి తెలుపుతూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా ఐశ్వర్య తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లూ కలర్ డ్రెస్సు వేసుకొని వావ్ అనిపించింది. ట్రెండీ అవుట్ ఫిట్‌లో మిర్రర్ ముందు హాట్ స్టిల్స్ ఇచ్చింది. మత్తెక్కించే కళ్లతో మెస్మరైజ్ చేసింది. ఇక వాటికి.. 'అద్దం నా వెలుగును ప్రతిబింబిస్తుంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు వావ్ సూపర్, క్యూట్, సో సూపర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.







## 180లో 40కిపైగా..
## కృష్ణంరాజు గురించి ఆసక్తికర విషయాలివీ



తాము హీరోగా తెరకెక్కే చిత్రంలో మరో కథానాయకుడు కనిపించాలన్నా.. తాము ఇతర హీరోల సినిమాలో చిన్న పాత్ర పోషించాలన్నా చాలామంది నటులు భయపడుతుంటారు. 'అలా చేస్తే ఏమవుతుందో? ఇలా నటిస్తే ఏం జరుగుతుందో? ఎవరికి ప్రాధాన్యత ఉంటుంది?' అంటూ లెక్కలేసుకుంటుంటారు. కృష్ణంరాజు (Krishnam Raju) ఇందుకు పూర్తిభిన్నం. అందుకే ఆయన దాదాపు 180 సినిమాల్లో నటిస్తే వాటిల్లో 40కిపైగా ఇతర నటులతో కలిసి నటించినవే. ఓ స్టార్ హీరోగా ఇలా చేయటం సాహసమే. 'డ్యూయెట్లు పాడితేనే, ఫైట్లు చేస్తేనే, భారీ డైలాగులు చెబితేనే హీరో కాదు' అని ఫీలయ్యే నటుడాయన. అందుకే తన తరం వారితోనే కాకుండా ఈతరం తారలతోనూ 'తెర' పంచుకున్నారు. జనవరి 20న ఆయన జయంతి సందర్భంగా ఆ సినిమాలతోపాటు మరికొన్ని సంగతులు గుర్తుచేసుకుందాం..

తన నట వారసుడు ప్రభాస్ (Prabhas)తో కలిసి 'బిల్లా', 'రెబల్', 'రాధేశ్యామ్' చిత్రాల్లో కృష్ణంరాజు సందడి చేశారు. కృష్ణతో కలిసి 'కురుక్షేత్రం', 'ఇంద్ర భవనం', 'అడవి సింహాలు' తదితర చిత్రాలు, ఏయన్నార్‌తో కలిసి 'జై జవాన్', 'ఎస్.పి. భయంకర్' తదితర సినిమాలు, ఎన్టీఆర్‌తో కలిసి 'మనుషుల్లో దేవుడు', 'వాడే వీడు' వంటి చిత్రాల్లో నటించారు. చిరంజీవి (మనవూరి పాండవులు, పులి బెబ్బులి తదితర), మోహన్‌బాబు (తిరుగుబాటు, సర్దార్ ధర్మన్న తదితర), బాలకృష్ణ (వంశోద్ధారకుడు, సుల్తాన్), వెంకటేశ్ (టూ టౌన్ రౌడీ), నాగార్జున (కిరాయి దాదా, నేటి సిద్ధార్థ) రాజశేఖర్ (గ్యాంగ్ మాస్టర్), జగపతిబాబు (సింహస్వప్నం, జైలర్‌గారి అబ్బాయి) చిత్రాల్లోనూ ఆయన కీలక పాత్రలు పోషించారు. ఈతరం హీరోల సినిమాల్లోనూ (ఎవడే సుబ్రహ్మణ్యం, తకిట తకిట తదితర) ఆయన నటించి అలరించారు.

'చిలకా గోరింకా' చిత్రంతో 1966లో కృష్ణంరాజు తెరంగేట్రం చేశారు. అప్పటికే వంద సినిమాలు చేసిన నటి కృష్ణకుమారి ఆయన సరసన నటించడం విశేషం. తొలి ప్రయత్నం అనుకున్న ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఇండస్ట్రీని విడిచి వెళ్లిపోవాలని కృష్ణంరాజు అనుకున్నారట. అదే సమయంలో ఒక రోజు అనుకోకుండా.. దర్శక, నిర్మాత ఎల్వీ ప్రసాద్‌ను కృష్ణంరాజు కలిశారు. ఆయన చెప్పిన మాటల వల్లే సినీ పరిశ్రమను విడిచి వెళ్లిపోదామనుకున్న కృష్ణంరాజు ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. 'కటకటాల రుద్రయ్య'తో పాటు అప్పట్లో పోషించిన కొన్ని పాత్రల వల్ల ఆయనకు రెబల్‌స్టార్ బిరుదు వచ్చింది. కృష్ణంరాజుకు పుస్తక పఠనమంటే ఎంతో ఇష్టం. ఖాళీ దొరికితే చాలు ఏదో ఒక పుస్తకాన్ని చదివేవారు. వాటిల్లోని గొప్ప పాత్రలను 'తెర'పైకి తీసుకురావాలనుకునేవారు. అలాంటి వాటిని రూపొందించేందుకు నిర్మాత దొరకడం కష్టమని ఒకానొక సమయంలో భావించారు. అలా 'గోపీకృష్ణా మూవీస్' అనే సంస్థను నెలకొల్పి, నిర్మాతగా మారారు.

## నన్ను కాపాడటానికి అమ్మానాన్న, భర్త ఎవరూ లేరు: రేణూ దేశాయ్ పోస్ట్



తనను కాపాడటానికి ఎవరూ లేరని నటి రేణూ దేశాయ్ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఇది వైరల్‌గా మారింది. వీధి కుక్కలను చంపేయడంపై ఆమె (Renu desai) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తనను కొందరు విమర్శిస్తున్నారని.. ఎన్ని విమర్శలు వచ్చినా తాను మాత్రం పోరాటం ఆపనని మరోసారి స్పష్టం చేశారు. కాశీలో గంగానదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను రేణు పంచుకున్నారు.

"నన్ను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరు. తాజా అంశంపై నా తప్పు లేకున్నా ఎంతోమంది నన్ను విమర్శిస్తున్నారు. మీరు చేసే వ్యాఖ్యలపై తిరిగి స్పందించను. నేను నమ్మే భగవంతుడి దగ్గర మాత్రమే నా బాధను చెబుతాను. ఆయన నా ప్రార్థనలు వింటాడన్న నమ్మకం నాకు ఉంది. నేను తరచూ కాశీకి ఎందుకు వెళ్తానో మీకు ఇప్పుడు అర్థమై ఉంటుంది.." అని అన్నారు.

ఇక వీధి కుక్కలను చంపడంపై తన పోరాటం గురించి కూడా రేణు ఈ పోస్ట్‌లో రాసుకొచ్చారు. "నేనెప్పుడూ నా వ్యక్తిగత హక్కుల కోసం పోరాడలేదు. కానీ, వీధి కుక్కల విషయంలో ఈ పోరాటం ఆపను. కొన్ని కుక్కలు చేసిన తప్పు వల్ల వందల సంఖ్యలో వాటిని చంపాలనే నిర్ణయం సరైనది కాదు. ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకునే వరకూ పోరాడుతూనే ఉంటాను" అని స్పష్టం చేశారు. ఇక ఈ అంశంపై రేణు ప్రెస్‌మీట్ అనంతరం ఆమె పొలిటికల్ పార్టీలో చేరనున్నారని వచ్చిన వార్తలపై కూడా స్పష్టతనిచ్చారు. తనకు అలాంటి ఉద్దేశం లేదన్నారు.

## సినీ నటుడు అల్లరి నరేశ్ ఇంట విషాదం:



సినీ నటుడు అల్లరి నరేశ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తాత ఈవీవీ సత్యనారాయణ తండ్రి ఈవీవీ వెంకట్రావు (90) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న వెంకట్రావు మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నిడదవోలు మండలం కోరుమామిడిలో ఈరోజు సాయంత్రం 4 గంటలకు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన సతీమణి వెంకటరత్నం 2019లో మరణించారు. వెంకట్రావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఈవీవీ సత్యనారాయణ 2011 జనవరి 21న మృతి చెందిన విషయం తెలిసిందే.

## అనగనగా ఒక రాజు.. నవీన్ పొలిశెట్టి ఎంటర్‌టైనర్ ఎలా ఉంది?

నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి (Naveen Polishetty). ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజు' (naveen polishetty new movie) అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మరి ఈ సినిమా ఎలా ఉంది ?(Anaganaga Oka Raju Review) ఎలాంటి నవ్వులు పంచింది?

కథేంటంటే...

గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కెయొచ్చని భావించి, ఆమె మనసుని గెలుచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే!

ఎలా ఉందంటే..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. (anaganaga oka raju review) ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది.

ప్రథమార్ధంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్ధం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుంది చిత్రం.

ఎవరెలా చేశారంటే..

Anaganaga Oka Raju cast || నవీన్ పొలిశెట్టి (Naveen Polishetty) వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి (Meenakshi Chaudhary) ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.

సమీక్ష:

బలాలు
+ నవీన్ పొలిశెట్టి పంచిన హాస్యం
+ సంభాషణలు
+ ప్రథమార్ధం

బలహీనతలు
కొత్తదనం లేని కథ
ఊహకు తగ్గట్టుగా సాగే కథనం

చివరిగా: అనగనగా ఒక రాజు... ఈ పండక్కి నవ్వులు పంచుతాడు.. (Anaganaga Oka Raju Review)

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!



# క్రీడాకారిణులకు అండగా సానియా



హైదరాబాద్: భారత్‌లో అగ్రశ్రేణి, వర్ధమాన క్రీడాకారిణులకు భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా అండగా నిలవనుంది. ఇందుకోసం 'ది నెక్స్ట్ సెట్'ను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం సానియా ప్రకటించింది. మొదట టెన్నిస్‌తో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపింది. అత్యున్నత స్థాయిలో మహిళా అథ్లెట్లకు నిర్మాణాత్మక మద్దతు, ప్రొఫెషనల్ క్రీడల్లో అవసరాలకు తగ్గట్లు సహాయం అందించడం 'ది నెక్స్ట్ సెట్' ముఖ్య ఉద్దేశం. టోర్నీల్లో పాల్గొనే క్రీడాకారిణులకు కోచ్‌లు, ఫిజియోథెరపిస్ట్‌లు, ట్రెయినర్ల సేవల్ని అందివ్వడం ఇందులో ప్రధానమైనది. దాంతోపాటు సానియా ఆధ్వర్యంలో అకాడమీలో టెన్నిస్ శిక్షణ శిబిరాలు, కోచింగ్ క్లినిక్‌లు నిర్వహిస్తారు. "ది నెక్స్ట్ సెట్‌తో నాది ప్రత్యేక అనుబంధం. కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులను అనుభవించిన నాకు సరైన సమయంలో మార్గనిర్దేశం ఎంతగా పనికొస్తుందో ప్రత్యక్షంగా తెలుసు. భారత మహిళా టెన్నిస్‌లో ప్రతిభకు కొదవలేదు. సరైన మద్దతుతో మన క్రీడాకారిణులు ప్రపంచ వేదికపై పోటీపడొచ్చు. భవిష్యత్తు తరానికి బలమైన బాట వేయడమే నా ఉద్దేశం" అని సానియా వివరించింది.

## బ్రెండన్ మెకల్లమ్‌పై వేటు.. ముహూర్తం ఫిక్స్!



ఇంగ్లండ్ 'బాజ్‌బాల్' వ్యూహం ఆస్ట్రేలియా గడ్డపై బెడిసికొట్టిన సంగతి తెలిసిందే. ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌ను 41 తేడాతో ఇంగ్లీష్ జట్టు కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు కఠిన నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. హెడ్‌కోచ్ బ్రెండన్ మెకల్లమ్‌పై వేటు వేసేందుకు ఈసీబీ సిద్ధమైనట్లు సమాచారం.

మెకల్లమ్ కాంట్రాక్ట్‌ను పొడిగించే యోచనలో ఈసీబీ లేదంట. 'ది టెలిగ్రాఫ్' కథనం ప్రకారం.. టీ20 వరల్డ్ కప్2026 తర్వాత మెక్‌కల్లమ్‌ను హెడ్‌కోచ్ పదవి నుంచి తప్పించనున్నట్లు తెలుస్తోంది. ఈ న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టుకు ఆల్‌ఫార్మాట్ హెడ్ కోచ్‌గా కొనసాగుతున్నాడు. తొలుత కేవలం టెస్టు జట్టు హెడ్‌కోచ్‌గా మాత్రమే కొనసాగిన మెక్‌కల్లమ్.. గతేడాది వైట్‌బాల్ క్రికెట్‌లో ప్రధాన కోచ్ పగ్గాలు చేపట్టాడు.అయితే మెకల్లమ్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టాక ఆ జట్టు ఆటతీరులో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మెకల్లమ్ అప్పుడే కొత్తగా టెస్టు కెప్టెన్ అయిన బెన్ స్టోక్స్‌తో కలిసి 'బాజ్‌బాల్'కు శ్రీకారం చుట్టాడు. 'బాజ్' అన్నది మెకల్లమ్ ముద్దుపేరు. టీ20 శైలిలో దూకుడుగా ఆడుతూ టెస్టు క్రికెట్ రూపరేఖలనే ఇంగ్లండ్ మార్చేసింది.స్టోక్స్‌మెకల్లమ్ ద్వయం కొన్నాళ్లపాటు అద్భుతం చేసింది. కానీ నెమ్మదిగా బాజ్‌బాల్‌కు బీటలు పడ్డాయి. ఇంగ్లీష్ జట్టు వరుస ఓటములతో సతమతమవుతోంది. ఐసీసీ టోర్నీలతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లలో కూడా మెరుగైన ప్రదర్శన చేయలేక విమర్శలు ఎదుర్కొంటోంది. ప్రతిష్టత్మక యాషెస్ సిరీస్‌ను ఇంగ్లండ్ వరుసగా రెండోసారి కోల్పోయింది.

అంతేకాకుండా జట్టు ఆన్‌ఫీల్డ్, ఆఫ్ ఫీల్డ్ క్రమశిక్షణ కూడా లోపించింది. ఆసీస్ పర్యటన మధ్యలో ఆటగాళ్లు 'నూసా' (Noosa) రిసార్ట్‌కు వెళ్లడం, అక్కడ మితిమీరిన విందు వినోదాల్లో పాల్గొనడం వంటి అంశాలపై కూడా తీవ్ర స్దాయిలో విమర్శలు వచ్చాయి. ఆటగాళ్లకు మెకల్లమ్ అనుసరిస్తున్న తీరు జట్టు క్రమశిక్షణను దెబ్బతీస్తోందని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. ఈ క్రమంలోనే అతడిని తప్పించేందుకు ఈసీబీ సిద్ధమైంది. ఒకవేళ మెక్‌కల్లమ్ స్థానంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలెస్టర్ కుక్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## SIR వెరిఫికేషన్‌కు హాజరైన క్రికేటర్ మహమ్మద్ షమీ.



భారత ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) వెరిఫికేషన్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడతలో ఏడు రాష్ట్రాల్లో ఈ SIR కొనసాగుతుంది. ఈ క్రమంలోనే పశ్చిమ బెంగాల్ లో సైతం ఎన్నికల అధికారులు వేగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వెరిఫికేషన్ కొనసాగిస్తున్నారు. కాగా భారత స్టార్ క్రికెటర్ మహమ్మద్ షమీ పశ్చిమ బెంగాల్‌లోని స్వర్ణమయి విద్యాలయంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) విచారణకు హాజరయ్యారు. ఓటర్ల జాబితాలో వివరాల సవరణ, ధృవీకరణ కోసం ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా షమీ తన వివరణను అధికారులకు అందజేశారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

సవరణలు చేయించుకోవడం మన బాధ్యత

ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడం, ఏవైనా తప్పులు ఉంటే సవరణలు చేయించుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని షమీ పేర్కొన్నారు. "SIR ప్రక్రియ అనేది మనకు హాని చేసేది కాదు. మన వివరాలు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవడం మన బాధ్యత. అందుకే అధికారులు పిలిచినప్పుడు నేను ఇక్కడికి వచ్చాను" అని ఆయన స్పష్టం చేశారు.

అధికారుల తీరుపై ప్రశంసలు

వెరిఫికేషన్ ప్రక్రియను ఎన్నికల అధికారులు చాలా పద్ధతిగా, వేగంగా నిర్వహించారని షమీ ప్రశంసించారు. "నేను గత 2025 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాను. అధికారులు నన్ను పిలిచినందుకు నాకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ప్రక్రియ అంతా సజావుగా సాగింది. భవిష్యత్తులో అవసరమైతే మళ్లీ రావడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను" అని స్టార్ క్రికెటర్ మహ్మద్ షమీ తెలిపారు. ఓటర్ల జాబితాలో సమాచార వ్యత్యాసాల నేపథ్యంలో, షమీ తో పాటు ఆయన సోదరుడు మహమ్మద్ కైఫ్‌కు కూడా అధికారులు నోటీసులు జారీ చేశారు. తొలుత బిజీ షెడ్యూల్ కారణంగా హాజరు కాలేకపోయిన షమీ, తాజాగా విచారణకు హాజరై తన పౌర బాధ్యతను చాటుకున్నారు. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ప్రస్తుతం ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ కొనసాగుతోంది.

# ఢిల్లీని గెలిపించిన జెమీమా

### మళ్లీ ఓడిన ముంబై ఇండియన్స్
### నాట్ సీవర్ మెరుపులు వృథా





: జెమీమా రోడ్రిగ్స్ (37 బంతుల్లో 51 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్‌ను గెలిపించింది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ ఖాతాలో రెండో విజయం చేరింది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. నాట్ సీవర్ బ్రంట్ (45 బంతుల్లో 65 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (33 బంతుల్లో 41; 7 ఫోర్లు) రాణించారు.

21 పరుగుల వద్దే ఓపెనర్లు సజన (9), హేలీ మాథ్యూస్ (12) నిష్క్రమించగా... హర్మన్, బ్రంట్ మూడో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. క్యాపిటల్స్ బౌలర్లలో తెలుగమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు లీజెల్లి లీ (28 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), షఫాలీ వర్మ (29; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 63 పరుగులతో చక్కని ఆరంభమిచ్చారు. ముంబైకిది 'హ్యాట్రిక్' పరాజయం. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6 మ్యాచ్‌లాడిన హర్మన్ బృందం కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే గెలిచింది. డబ్ల్యూపీఎల్‌లో నేడు విశ్రాంతి దినం. గురువారం జరిగే మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: సజన (బి) నందిని 9; హేలీ మాథ్యూస్ (బి) మరిజాన్ కాప్ 12; నాట్ సీవర్ (నాటౌట్) 65; హర్మన్‌ప్రీత్ (సి) హామిల్టన్ (బి) శ్రీచరణి 41; నికోలా కేరీ (సి) స్నేహ్ రాణా (బి) శ్రీచరణి 12; అమన్‌జోత్ (సి) లీజెల్లి (బి) శ్రీచరణి 3; సంస్కృతి (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 154. వికెట్ల పతనం: 1-21, 2-21, 3-99, 4-130, 5-134.

బౌలింగ్: మరిజాన్ 4-0-8-1, హామిల్టన్ 4-0-36-0, నందిని శర్మ 4-0-36-1, శ్రీచరణి 4-0-33-3, స్నేహ్ రాణా 3-0-27-0, షఫాలీ వర్మ 1-0-14-0

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: షఫాలీ (బి) వైష్ణవి 29; లీజెల్లి లీ (స్టంప్డ్) రహిలా (బి) అమన్‌జోత్ 46; వోల్వార్డ్ (రనౌట్) 17; జెమీమా (నాటౌట్) 51; మరిజాన్ కాప్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (19 ఓవర్లలో 3 వికెట్లకు) 155. వికెట్ల పతనం: 1-63, 2-84, 3-118.

బౌలింగ్: షబ్నిమ్ 4-0-26-0, నికోలా 1-0-13-0, నాట్ సీవర్ 4-0-42-0, సంస్కృతి 1-0-13-0, అమన్‌జోత్ 3-0-21-1, వైష్ణవి 4-0-20-1, హేలీ 2-0-19-0.

# చాంపియన్ల ముందంజ



### రెండోరౌండ్‌కు సినర్, కీస్
### ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: పురుషుల డబుల్ డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ)ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ముందంజ వేశాడు. అలాగే మహిళల డిఫెండింగ్ చాంప్ మాడిసన్ కీస్ కూడా శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన సింగిల్స్ ఆరంభ రౌండ్లో సినర్ 62, 61తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి హ్యూగో గాస్టన్ (ఫ్రాన్స్)వాకోవర్ ప్రకటించాడు. దీంతో సినర్ రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. మరోవైపు, తనకిదే చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అని ప్రకటించిన మోన్‌ఫిల్స్. స్థానిక క్వాలిఫయర్ డేన్ స్వీనీ చేతిలో ఓటమి తప్పలేదు. మిగతా టాప్ ఆటగాళ్లలో 5వ సీడ్ ముసెట్టి, 9వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్, 8వ సీడ్ బెన్ షెల్టన్, 15వ సీడ్ ఖచనోవ్ రెండో రౌండ్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో డిఫెండింగ్ చాంప్, 9వ సీడ్ మాడిసన్ కీస్ 76 (6), 61తో ఉక్రెయిన్‌కు చెందిన ఒలిన్‌కోవాపై, 5వ సీడ్ రిబకినా 64, 63తో జువాన్‌పై, 10వ సీడ్ బెన్‌సిచ్ 60, 75తో బౌల్టర్‌పై, మాజీ చాంపియన్ నవోమి ఒసాకా 63, 36, 64తో రూజిక్ (క్రొయేషియా)పై, ఓస్టాపెంకో 64, 64తో స్రామ్‌కోవాపై గెలిచి రెండోరౌండ్ చేరారు.

డబుల్స్‌లో నిక్కీకి నిరాశ..: పురుషుల డబుల్స్ బరిలోకి దిగిన భారత ఆటగాడు నిక్కీ పూనాచకు నిరాశే ఎదురైంది. డబుల్స్ తొలి రౌండ్లో నిక్కీ/ప్రూచ్యా ఇసారో (థాయ్‌లాండ్) జోడీ స్పెయిన్ జంట మార్టినెజ్/మునార్ చేతిలో ఓటమిపాలైంది.

బసవారెడ్డి బోణీ అదిరింది..

అమెరికా తరపున ఆడుతున్న తెలుగు సంతతి ఆటగాడు నిశేష్ బసవారెడ్డి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశాడు. నాలుగు గంటలా 11 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో క్వాలిఫయర్ బసవారెడ్డి 46, 76(7), 67(3), 62, 63తో స్థానిక ఆటగాడు, 31 ఏళ్ల క్రిస్ ఓ కానెల్‌పై నెగ్గాడు. బసవారెడ్డి తల్లిదండ్రులు మురళీ రెడ్డి, ప్రసన్న అమెరికాలో స్థిరపడ్డారు.

# ఇప్పుడైనా బదులిస్తారా?



ప్రపంచకప్ ముంగిట భారత్‌కు కీలక పోరు
న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ నేటి నుంచే
తొలి మ్యాచ్ రాత్రి 7 నుంచి నాగ్‌పూర్ వేదికగా..

2024 చివర్లో సొంతగడ్డపై టీమ్ఇండియాను న్యూజిలాండ్ కొట్టిన దెబ్బను అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. స్వదేశంలో అప్రతిహత విజయాలతో సాగిపోతున్న భారత్‌ను టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ చేసి సంచలనం సృష్టించింది కివీస్. 15 నెలల విరామం తర్వాత పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్ కోసం మళ్లీ ఇక్కడికి వచ్చిన న్యూజిలాండ్‌పై టీమ్ఇండియా ఘనంగా ప్రతీకారం తీర్చుకుంటుందని ఆశించారు అభిమానులు. కానీ వన్డే సిరీస్ కూడా చేజారింది. ఇప్పుడిక ఆ జట్టుతో టీ20 సమరానికి సమయం ఆసన్నమైంది. సొంతగడ్డపై పొట్టి ప్రపంచకప్ ముంగిట ఈ సిరీస్ సూర్యకుమార్ సేనకు ఎంతో కీలకం. మరి ఇప్పుడైనా కివీస్‌కు టీమ్ఇండియా బదులిస్తుందా?

భారత గడ్డపై టెస్టు, వన్డే సిరీస్‌లు గెలవని లోటును 15 నెలల వ్యవధిలో తీర్చుకున్న న్యూజిలాండ్.. ఇప్పుడు టీమ్ఇండియాకు మరో సవాల్ విసురుతోంది. టీ20 ప్రపంచకప్ ముంగిట జరిగే చివరి సిరీస్‌ను ఆ జట్టుతోనే ఆడబోతోంది సూర్యకుమార్ సేన. అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం నాగ్‌పూర్‌లో జరగనుంది. వన్డే సిరీస్ జరిగిన తీరు చూస్తే.. టీ20 పోరు కూడా హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

శ్రేయస్ ఆడతాడా?: సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ ముంగిట జరుగుతున్న చివరి సిరీస్ కావడంతో భారత్‌కు ఇది ఎంతో కీలకం. టెస్టులు, వన్డేల్లో ఎలాంటి ఫలితాలు వస్తున్నప్పటికీ.. టీ20ల్లో టీమ్ఇండియా వరుస సిరీస్ విజయాలతో దూసుకెళ్తుండడం శుభ సూచకం. 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత్ ఈ ఫార్మాట్లో ఒక్క సిరీసూ ఓడిపోలేదు. గత నెలలో దక్షిణాఫ్రికాను ఓడించిన సూర్యకుమార్ సేన.. అంతకుముంద]ు ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపై మట్టికరిపించింది. ఇదే ఊపులో కివీస్‌నూ ఓడించి పొట్టి ప్రపంచకప్‌నకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. శస్త్రచికిత్స కారణంగా ఈ సిరీస్‌కు తిలక్ వర్మ దూరం కావడంతో శ్రేయస్ అయ్యర్‌కు జట్టులో చోటు దక్కింది. అతను తొలి టీ20లో బరిలోకి దిగే అవకాశాలున్నాయి. మూడేళ్లకు పైగా టీ20ల్లో ఆడని శ్రేయస్.. ఇప్పుడు తుది జట్టులో అవకాశం లభిస్తే ఎలా ఉపయోగించుకుంటాడో చూడాలి. ప్రమాదకర ఓపెనర్ అభిషేక్ శర్మపై భారత్ చాలా ఆశలు పెట్టుకుంది. అతను పవర్ ప్లే అయ్యే వరకు నిలిస్తే జట్టుకు బలమైన పునాదే పడుతుంది. అభిషేక్‌తో కలిసి సంజు శాంసన్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. అతను మంచి లయలోనే ఉన్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అదరగొట్టి జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బరిలో దిగనున్నాడు. కానీ సారథి ఫామే జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. ఈ సిరీస్‌లో అయినా సూర్య జోరందుకుంటాడేమో చూడాలి. హార్దిక్ పాండ్య మిడిలార్డర్‌కు అతి పెద్ద బలం. అతడితో పాటు మరో ఆల్‌రౌండర్ శివమ్ దూబె కూడా తుది జట్టులో ఉండే అవకాశముంది. వీళ్లిద్దరూ బౌలింగ్‌లోనూ కీలకమే. నాగ్‌పూర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలం కాబట్టి బుమ్రా ఒక్కడే తుది జట్టులో స్పెషలిస్టు పేసర్‌గా ఉండొచ్చు. అక్షర్ పటేల్‌కు తోడు కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు.



బలమైన బ్యాటింగ్‌తో..: వన్డే సిరీస్ గెలిచిన కివీస్.. టీ20ల్లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. భీకర ఫామ్‌లో ఉన్న మిచెల్‌కు తోడు ఫిలిప్స్, కాన్వే, టిమ్ రాబిన్సన్, రచిన్ రవీంద్ర, చాప్‌మన్, నీషమ్‌లతో ఆ జట్టు బ్యాటింగ్ చాలా బలంగా కనిపిస్తోంది. స్పెషలిస్టు స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధిలకు తోడు పార్ట్‌టైమర్లు రచిన్, ఫిలిప్స్‌లతో స్పిన్ విభాగం కూడా మెరుగ్గా ఉంది. మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫీ, నీషమ్ పేస్ బాధ్యతలు పంచుకుంటారు.

ఆ వేదికలో చేదు జ్ఞాపకం: న్యూజిలాండ్‌తో తొలి టీ20కి వేదికగా నిలవనున్న నాగ్‌పూర్ స్టేడియంలో ఇదే ప్రత్యర్థి చేతిలో పదేళ్ల ముందు ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది టీమ్ఇండియా. 2016లో ధోని నాయకత్వంలోని భారత జట్టు 47 పరుగుల తేడాతో ఓడింది. స్పిన్‌కు విపరీతంగా సహకరించిన పిచ్‌పై మొదట కివీస్ 7 వికెట్లకు 126 పరుగలే చేయగలిగింది. దీంతో టీమ్ఇండియా అలవోకగా లక్ష్యాన్ని ఛేదించేస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ శాంట్నర్ (4/11), ఇష్ సోధి (3/18)ల ధాటికి విలవిలలాడిన భారత్.. 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే కుప్పకూలింది. ప్రస్తుత మ్యాచ్‌లోనూ స్పిన్నర్ల జోరు కొనసాగుతుందనే అంచనాలున్నాయి. నాడు భారత్‌ను దెబ్బ కొట్టిన శాంట్నర్, సోధి ఇప్పుడు కూడా కివీస్ జట్టులో ఉన్నారు. వీరికి తోడు పార్ట్‌టైమ్ స్పిన్నర్లు గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్రల అండ కూడా ఆ జట్టుకుంది. భారత్ కూడా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. ఇరు జట్ల బ్యాటర్లు స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటారన్న దాని మీదే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంటుందనడంలో సందేహం లేదు. రాత్రయ్యే కొద్దీ మంచు ప్రభావం పెరిగి బంతిపై పట్టు దొరకడం కష్టమవుతుంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ చేసే అవకాశముంది.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్/రింకు సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, శివమ్ దూబె, కుల్‌దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

న్యూజిలాండ్: టిమ్ రాబిన్సన్, డెవాన్ కాన్వే (వికెట్ కీపర్), రచిన్ రవీంద్ర, డరెల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, జేమ్స్ నీషమ్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), మ్యాట్ హెన్రీ, ఇష్ సోధి, జాకబ్ డఫీ.